ఉద్యోగ సంఘాలతో నేడు ఉపసంఘం భేటీ

హైదరాబాద్, మార్చి 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం జీవో 317, జీవో 46పై నియమించిన మంత్రివర్గ ఉపసంఘం గురువారం ఉద్యోగ సంఘాలతో భేటీ కానున్నది. మంత్రి దామోదర్ రాజనర్సింహా అధ్యక్షతన మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌తో కూడిన ఈ కమిటీ సచివాలయంలో ఉద్యోగ సంఘాల నుంచి విజ్ఞప్తులను స్వీకరించనున్నది. జీవోలు 317, 46 వల్ల ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను కమిటీకి వివరించాలని మంగళవారం జరిగిన భేటీలో నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు విజ్ఞప్తులు స్వీకరించడంతోపాటు గ్రీవెన్స్ సెల్‌ను ఏర్పాటు చేయనున్నారు.

కాంగ్రెస్‌లోకి మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

కాగజ్‌నగర్ ఎస్పీఎం కాలనీ, మార్చి 13: 'బీఆర్ఎస్‌లో పదేండ్ల పాటు పని చేశా. పార్టీ కోసం ఎంతో కష్టపడ్డా. కానీ గత ఎన్నికల్లో నా ఓటమికి కారణమైన బీఎస్పీతో పొత్తుపెట్టుకోవడం కరెక్ట్ కాదు. అందుకే కార్యకర్తల నిర్ణయం మేరకు గురువారం కాంగ్రెస్‌లో పార్టీలో చేరుతున్నా' అంటూ సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప స్పష్టం చేశారు. బుధవారం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలోని కోనేరు కోనప్ప నివాసంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్, సిర్పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ సమక్షంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కోనప్ప మాట్లాడారు. బీఆర్ఎస్‌తో గానీ, మాజీ సీఎం కేసీఆర్‌తో గానీ ఎటువంటి విభేదాలు లేవని, కేవలం నియోజకవర్గ అభివృద్ధి కోసమే తాను కాంగ్రెస్‌లో చేరుతున్నానని చెప్పారు.

నేతన్నలకు రిక్త'హస్తం'!

సంక్షోభంలో సిరిసిల్ల వస్త్రపరిశ్రమ

- కాంగ్రెస్ హయాంలో కదలని మరచక్రాలు
- ఇప్పటి వరకు ఊసేలేని వస్త్ర ఆర్డర్లు
- ఇంకా చెల్లించని రూ.290 కోట్ల బకాయిలు
- నేతన్నల ఆకలికేకలు.. ఆదుకోవాలని విజ్ఞప్తులు
- నేటి నుంచి నేతన్నల రిలే దీక్షలు

వస్త్ర ఉత్పత్తులు లేక నిలిచిపోయిన సాంచాలు

రాజన్న సిరిసిల్ల, మార్చి 13 (నమస్తే తెలంగాణ) : వ్యవసాయం తర్వాత లక్షలాది మందికి ఉపాధి కల్పించే వస్త్ర పరిశ్రమ ఆర్థిక సంక్షోభంలో కునారిల్లుతున్నది. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో సాంచాలకు సంకెళ్లు పడ్డాయి. ఇప్పటి వరకు వస్త్ర ఉత్పత్తుల ఆర్డర్లు లేకపోవడం వల్ల మర చక్రాలు కదలడం లేదు. మరోవైపు రూ.290 కోట్ల పాత బకాయిలు విడుదల చేయకుండా కొత్త ప్రభుత్వం నేతన్నలకు రిక్త హస్తం చూపుతున్నది. దీంతో మూడు నెలలుగా పనిలేక బతుకు భారమై ఓ యువ నేతన్న ఆత్మహత్య చేసుకోవడం ఆందోళన కలిగిస్తున్నది.

రాష్ట్రంలోనే అత్యధిక మరమగ్గాలతో సిరిసిల్ల మరమగ్గాల పరిశ్రమ వేలాది మందికి బతుకు దెరువు ఇస్తున్నది. సమైక్యరాష్ట్రంలో ఉరిసిల్లగా మారిన సిరిసిల్లకు స్వరాష్ట్రంలో జవసత్వాలు వచ్చాయి. ఉద్యమ నాయకుడిగా. ముఖ్యమంత్రిగా కేసీఆర్ నేతన్నలకు నేనున్నాంటూ భరోసా ఇచ్చారు. సిరిసిల్లకు బతుకమ్మ చీరలు, క్రిస్మస్, రంజాన్ తోఫా, విద్యార్థులకు యూనిఫాంల తయారీ ఆర్డర్లు ఇస్తూ నేతకార్మికులకు ఏడాది పొడవునా జీవనోపాధి కల్పించారు. ప్రతి సంవత్సరం సుమారు రూ. 300 కోట్ల వరకు ఆర్డర్లు ఇచ్చి, కార్మికుల సంక్షేమం కోసం త్రిప్టు, నేతన్న బీమా, యారన్ సబ్సిడీ పథకాలను అమలు చేశారు. అంతేకాకుండా నేత కార్మికులకు యాభై ఏండ్లకే నెలకు రూ.2016 పింఛను ఇచ్చి ఆసరా అయ్యారు. కేసీఆర్ ప్రభుత్వం కల్పించిన భరోసాతో నేతన్నలు వలసలు వాపస్ వచ్చారు. కేసీఆర్ పాలనలో సంక్షేమం వైపు పయనించిన వస్త్ర పరిశ్రమ ప్రభుత్వమార్పుతో మళ్లీ సంక్షోభంలోకి కూరుకుపోతుంది.

బకాయిలు రూ.290 కోట్లు

సిరిసిల్ల మరమగ్గాల పరిశ్రమకు ప్రభుత్వం రూ.290 కోట్లు బకాయి పడింది. బతుకమ్మ చీరలకు సంబంధించి రూ.200ల కోట్లు, ఆర్‌వీఎం బకాయిలు రూ.70 కోట్లు, యారన్ సబ్సిడీలవి మరో రూ.20కోట్లు రావాలని యజమానులు చెపుతున్నారు. ప్రభుత్వం వెంటనే చెల్లిస్తుందన్న నమ్మకంతో అప్పులు తెచ్చి చీరలు తయారు చేసిన యజమానులకు కాంగ్రెస్ సర్కారు పైసలు ఇవ్వకపోవడంతో సాంచాలు నడిపించే స్థోమతలేక బంద్ పెట్టారు. గత ప్రభుత్వం ప్రతి ఏటా ఫిబ్రవరి చివరి వారంలోనే బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇచ్చేది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు వాటి ఊసెత్తడం లేదు. ఒకవైపు పైసలు ఇవ్వక, మరోవైపు కొత్త ఆర్డర్లకు జీవో రాకపోవడంతో మూడు నెలలుగా మరమగ్గాలు మూతపడ్డాయి. కార్మికులు పనిలేక పస్తులుంటున్నారు. కడుపులు కాలి దిక్కుతోచని, దయనీయ పరిస్థితిలో కార్మికులు రోడ్డెక్కి నిరసనలు చేసినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పనిలేక సోమవారం యువ నేత కార్మికుడు ఉరిపెట్టుకోవడంతో కార్మిక కుటుంబాలలో ఆందోళన వ్యక్తమవుతున్నది. పదేండ్ల తరువాత పాత రోజులు రాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదని కార్మికులు కోరుతున్నారు. బకాయిలు విడుదల చేసి, చేతి నిండా పని కల్పించాలని గురువారం నుంచి సిరిసిల్లలో రిలేదీక్షలు చేపట్టేందుకు నేత కార్మికులు సిద్ధం అవుతున్నారు.

పస్తుల్లో కార్మికులు

ప్రస్తుత ప్రభుత్వం బకాయిలు రూ.290 కోట్లు ఇవ్వక, బతుకమ్మ చీరల ఆర్డర్ల జీవో విడుదల చేయక పోవడం వల్ల పరిశ్రమ ఇబ్బందులు ఎదుర్కొంటున్నది. కార్మికులు పస్తులుండే పరిస్థితి నెలకొన్నది. ప్రభుత్వం వెంటనే స్పందించాలని నేటి నుంచి సిరిసిల్లలో రిలేదీక్షలు చేపడుతున్నాం. చేనేత పవర్‌లూం కార్మికుల అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేసి రూ.1000 కోట్ల నిధులు కేటాయించాలి. రాష్ట్ర వ్యాప్తంగా టెస్కోకు ఇవ్వాల్సిన బకాయిలు మొత్తం రూ.485.89 కోట్లు వెంటనే విడుదల చేయాలి.

- కూరపాటి రమేశ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెలంగాణ పవర్‌లూం వర్కర్స్‌యూనియన్

చేనేత కార్మికుల ఆత్మహత్యల్ని నివారించండి

- సీఎం రేవంత్‌రెడ్డికి చాడ వెంకట్‌రెడ్డి లేఖ

హైదరాబాద్, మార్చి 13(నమస్తే తెలంగాణ): చేనేత కార్మికుల ఆత్మహత్యల్ని నివారించాలని, ఇందుకు అవసరమైన చర్యల్ని యుద్ధ ప్రాతిపదికన తీసుకోవాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డికి బుధవారం లేఖ రాశారు. సిరిసిల్లలో తడుక శ్రీనివాస్ అనే చేనేత కార్మికుడు ఆత్మహత్య చేసుకోవడం దురదృష్టకరమని అన్నారు. శ్రీనివాస్ కుటుంబాన్ని ఆదుకోవాలని, రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కోరారు. ఆత్మహత్యలు ఇంతటితో ఆగిపోయేలా చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

బుధవారం తన జన్మదినం సందర్భంగా భారీ కేక్‌ను కట్ చేస్తున్న ఎమ్మెల్సీ కవిత

ఘనంగా ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలు

హైదరాబాద్, మార్చి 13 (నమస్తే తెలంగాణ) : బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. మంగళవారం అర్ధరాత్రి బీఆర్ఎస్, భారత జాగృతి శ్రేణులు హైదరాబాద్‌లోని ఆమె నివాసానికి చేరుకొని భారీ కేక్‌ను కట్ చేయించి, శుభాకాంక్షలు తెలిపారు. తన జన్మదినం సందర్భంగా కవిత బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసి ఆశీర్వాదం తీసుకొన్నారు. మరోవైపు, సామాజిక మాధ్యమాల ద్వారా ఎమ్మెల్సీ కవితకు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. తనకు శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ ఆమె కృతజ్ఞతలు చెప్పారు.

డిప్యూటీ కలెక్టర్ల బదిలీలు

హైదరాబాద్, మార్చి 13(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని పలువురు స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు, డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ ఉత్తర్వులు తక్షణమే అమలులోకి వస్తాయని ఉన్నతాధికారులు పేర్కొన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా లేని పోస్టింగులు ఉంటే వెంటనే ప్రభుత్వానికి తెలపాలని కలెక్టర్లకు సూచించారు.

19 మంది ఆర్డీవోల బదిలీ

హైదరాబాద్, మార్చి 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో 19 మంది ఆర్డీవోలను ప్రభుత్వం బదిలీ చేసింది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ బదిలీలు చేపట్టినట్టు ఉన్నతాధికారులు తెలిపారు. ఈ మేరకు రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు.

మహిళలకు సరైన వాటా దక్కడం లేదు

అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే

హైదరాబాద్, మార్చి 13 (నమస్తే తెలంగాణ) : మహిళలకు విద్యా, ఉద్యోగ, రాజకీయాల్లో జనాభా దామాషా ప్రకారం సరైన వాటా దక్కడంలేదని కాకతీయ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే పేర్కొన్నారు. అన్ని రంగాలలో మహిళలకు సమాన అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉన్నదని చెప్పారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక వర్సిటీలో మహిళా అభివృద్ధి, విస్తరణ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ప్రొఫెసర్ కాత్యాయని మాట్లాడుతూ... 'మహిళా శక్తి–మహిళా హక్కులు' అనే అంశంపై ప్రసంగించారు. కాకతీయ వర్సిటీ వీసీ సీతారామారావు మాట్లాడుతూ.. ఈ ప్రపంచంలో స్త్రీని మించిన మహాశక్తి ఏదీ లేదని, స్త్రీ లేక పోతే ఈ సృష్టి లేదని అన్నారు. మహిళా సాధికారత, అభ్యున్నతి, వివక్ష నిర్మూలనపై తమ విశ్వవిద్యాలయం పాత్యాంశాలను అందిస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా వీసీ గుర్తు చేశారు. కార్యక్రమంలో యూనివర్సిటీ అకడమిక్ డైరెక్టర్ జీ పుష్ప చక్రపాణి, మహిళా అభివృద్ధి విస్తరణ కేంద్రం ఇన్‌చార్జి డాక్టర్ జీ మేరీ సునంద, వివిధ విభాగాల డైరెక్టర్లు, డీన్లు, విభాగాధిపతులు,మహిళా ఉద్యోగినులు, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సిర్పూర్కర్ కమిషన్ నివేదికను రద్దు చేయండి

హైదరాబాద్, మార్చి 13 (నమస్తే తెలంగాణ): తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన 'దిశ' నిందితుల ఎన్‌కౌంటర్‌పై జస్టిస్ సిర్పూర్కర్ కమిషన్ దర్యాప్తు చేయకుండానే తమపై అభియోగాలు మోపిందని ఆరోపిస్తూ పోలీసులు, పోలీస్ ఆఫీసర్లు హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై జస్టిస్ బీ విజయ్‌సేన్‌రెడ్డి బుధవారం విచారణ ప్రారంభించారు. ఈ ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న 10 మంది పోలీసులను బాధ్యులుగా చేస్తూ కమిషన్ ఇచ్చిన నివేదికను రాజ్యాంగ విరుద్ధమైనదిగా ప్రకటించి రద్దు చేయాలని పిటిషనర్ల తరపు న్యాయవాదులు కోరారు.

'దుర్గం చెరువు'పై నివేదిక ఇవ్వండి

నిపుణుల కమిటీకి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, మార్చి 13 (నమస్తే తెలంగాణ): దుర్గం చెరువు పరిరక్షణకు చేపట్టే స్వల్పకాలిక ప్రణాళిక అమలు తీరుపై నివేదిక ఇవ్వాలంటూ నిపుణుల కమిటీని హైకోర్టు ఆదేశించింది. దుర్గం చెరువు బఫర్ జోన్‌లోని ఎన్టీఎల్ పరిధిలో అక్రమ నిర్మాణాలను ఎప్పటిలోగా తొలగిస్తారన్న దానిపై వివరణ ఇవ్వాలని ప్రభుత్వానికి స్పష్టం చేసింది. మురునీటి ప్రవాహం, రసాయనాలు, చెరువు కలుషితమై చేపలు చనిపోతున్నాయంటూ వచ్చిన వార్తలను హైకోర్టు సుమోటోపిల్‌గా స్వీకరించింది. దీనిపై ధర్మాసనం విచారణను వాయిదా వేసింది.

ఒక్కో కార్పొరేషన్‌కు 100 కోట్లు ఇవ్వాలి

బీసీ సంఘాల నేతలు జాజుల, కొండూరి

హైదరాబాద్, మార్చి13 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఉన్న బీసీ, ఎంబీసీ కార్పొరేషన్లకు రూ.100 కోట్ల చొప్పున కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, ఎంబీసీ సంఘాల కన్వీనర్ కొండూరు సత్యనారాయణ బుధవారం వేర్వేరు ప్రకటనల్లో డిమాండ్ చేశారు. ప్రస్తుత ప్రభుత్వం ఏర్పాటుచేసిన 8 బీసీ కులాలకు వెంటనే పాలకమండళ్లను నియమించాలని కోరారు. కార్పొరేషన్లు లేని ఇతర బీసీ కుల వృత్తులకు కూడా కార్పొరేషన్లను ఏర్పాటు చేయాలని కోరారు. బీసీ, ఎంబీసీ కార్పొరేషన్ల ఏర్పాటుకు కృషి చేసిన సీఎం రేవంత్ రెడ్డికి, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

తెలంగాణ వాహనాలకు టీజీ

- నేటి నుంచి రాష్ట్ర వాహనాలకు టీజీతో నంబర్లు
- కేంద్రం గ్రీన్‌సిగ్నల్‌తో రిజిస్ట్రేషన్ ప్రక్రియలో మార్పు

హైదరాబాద్ సిటీబ్యూరో, మార్చి 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని వాహన నంబర్లు ఇకపై టీజీతో షురూ కానున్నాయి. ఇప్పటివరకు కొనసాగిన టీఎస్ సిరీస్‌కు రవాణా శాఖ స్వస్తి పలికింది. కొత్త టీఎస్ నంబర్ ప్లేట్ ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభంకానున్నది. ఈ మేరకు టీఎస్‌గా మార్పు కోరుతూ గతంలో కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం పంపిన లేఖను పరిశీలించిన కేంద్ర ఉపరితల రవాణా శాఖ అందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో ఇక నుంచి టీఎస్ స్థానంలో టీజీ కనిపించనున్నది. కొత్తగా రిజిస్ట్రేషన్ అయ్యే వాహనాలకే టీఎస్ వర్తిస్తుంది. పాత వాహనాలను మార్చుకోవాల్సిన అవసరం లేదని ఆర్టీఏ అధికారులు తెలిపారు. మళ్లీ మొదట్నుంచి నంబరింగ్ ఇవ్వనున్నారు. ఉదాహరణకు ఖైరతాబాద్ ఆర్టీవో పరిధిలో ఇప్పటి వరకు టీఎస్09జీజీ4322 నుంచి టీఎస్09జీజీ5321 వరకు రిజిస్ట్రేషన్ అవుతున్నాయి. బుధవారం వరకు రిజిస్ట్రేషన్ పూర్తయిన నంబర్లు కాకుండా మిగిలిన వాటిని రవాణా శాఖ రద్దు చేస్తుంది. మళ్లీ మొదటి నుంచి వాహన నంబర్లను ప్రవేశపెట్టబోతుంది. ఇకపై ఖైరతాబాద్ నుంచి టీజీ09ఏఏ0001 నెంబర్‌తో వాహన రిజిస్ట్రేషన్ ప్రారంభం అవుతుంది. లేదా ఎక్కడైతే టీఎస్ సిరీస్ రద్దు అవుతుందో అక్కడి నుంచి టీఎస్ స్థానంలో టీజీ చేర్చి అదే సిరీస్ పూర్తయ్యే (9999) వరకు నంబర్లు కేటాయించే అవకాశంపై కూడా అధికారులు యోచిస్తున్నారు. ఈ అంశంపై గురువారం మరింత స్పష్టత రానున్నది. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ తదితర జిల్లాల్లో టీఎస్ స్థానంలో టీజీ చేర్చి ఆయా ఆర్టీవో పరిధి సిరీస్ కోడ్‌తో నంబర్లు కేటాయిస్తారు.

అందరికీ ఆరోగ్యశ్రీ

- రేషన్ కార్డుతో సంబంధం లేకుండా పథకం అమలు
- రాజీవ్ ఆరోగ్యశ్రీ పేరుతో లబ్ధిదారులకు కొత్త కార్డులు
- మరో వంద చికిత్సలను చేర్చేందుకు వైద్యశాఖ కసరత్తు

హైదరాబాద్, మార్చి 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఆరోగ్యశ్రీని ప్రత్యేక పథకంగా అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నది. రేషన్ కార్డు, ఆర్థిక స్థితితో సంబంధం లేకుండా ప్రజలందరికీ వర్తించేలా ఈ పథకాన్ని విస్తరించాలని నిర్ణయించింది. ఈ నిర్ణయానికి అనుగుణంగా లబ్ధిదారులకు రాజీవ్ ఆరోగ్యశ్రీ పేరుతో కొత్త కార్డులు ఇవ్వాలని యోచిస్తున్నది. ఈ నేపథ్యంలో లబ్ధిదారుల గుర్తింపు, ఇతర మార్గదర్శకాలపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీల తరహాలో ప్రతి కుటుంబాన్ని ఒక యూనిట్‌గా తీసుకొని ప్రత్యేక నంబర్ కేటాయించి కార్డులు ఇవ్వాలని నిర్ణయించినట్టు సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా అందరికీ డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ రూపొందిస్తామని ఇప్పటికే ప్రకటించిన ప్రభుత్వం.. ఈ వివరాలను ఆరోగ్యశ్రీ కార్డులతో అనుసంధానం చేయనున్నది. రెండు మూడు నెలల్లో ఈ ప్రక్రియ ప్రారంభమయ్యే అవకాశం ఉన్నది. ప్రస్తుతం రాష్ట్రంలో 90 లక్షలకుపైగా తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయి. మిగతా వారిలో ప్రభుత్వ ఉద్యోగులు వంటివారు ఉన్నారు. వారికి కూడా ప్రభుత్వం ప్రత్యేకంగా హెల్త్ స్కీమ్‌ను అమలు చేయాల్సి వస్తున్నది. దీంతో 90 శాతానికిపైగా జనాభాకు ప్రభుత్వ హెల్త్ స్కీం వర్తిస్తున్నదని వైద్యశాఖ చెప్తున్నది. మిగతావారిని కవర్ చేసి, రేషన్ కార్డుతో లింక్ తీసేస్తే కార్డుల సంఖ్య తగ్గుతుందని భావిస్తున్నట్టు సమాచారం. ఇలా చేస్తే ప్రభుత్వంపై ఏటా దాదాపు రూ.450 కోట్ల మేరకు అదనపు భారం పడుతుందని అంచనా.

ప్యాకేజీల ధరల సవరణ దిశగా..

ఆరోగ్యశ్రీ కింద ప్రస్తుతం అందిస్తున్న 1,670 రకాల చికిత్సలకు అదనంగా మరో 100 చికిత్సలను చేర్చాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు సమాచారం. తమకు ఆరోగ్యశ్రీ వర్తించడం లేదంటూ ఇప్పటివరకు వచ్చిన విజ్ఞప్తుల ఆధారంగా వీటిని ఎంపిక చేస్తున్నారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచిన నేపథ్యంలో విలువైన చికిత్సలను చేర్చాలని ప్రభుత్వం భావిస్తున్నది. ప్యాకేజీల ధరలను కూడా సవరించాలని భావిస్తున్నట్టు సమాచారం.

జీరో బిల్లులు రాకపోయినా చెల్లించొద్దు

- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్పష్టీకరణ
- అర్హులందరికీ తెల్లరేషన్ కార్డులు
- పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



మక్తల్ సమీపంలోని సంగంబండ రిజర్వాయర్ పరిధిలో 400 మీటర్ల కెనాల్ తవ్వకానికి భూమిపూజ చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యేలు, ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు

మక్తల్/మక్తల్ టౌన్, మార్చి 13: గృహజ్యోతి పథకం కింద పేదలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తును మార్చి నెల నుంచే అమలు చేస్తున్నామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఎవరికైనా జీరో కరెంట్ బిల్లులు రాకపోయినా.. అధికారులు ఇంటి వద్దకు వచ్చి బిల్లులు చెల్లించాలని అడిగినా.. ఎవరూ డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. నారాయణపేట జిల్లా మక్తల్ సమీపంలోని సంగంబండ ఆర్ ఆర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్ద బుధవారం ఉదయం 11 గంటలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి హెలికాప్టర్‌లో ల్యాండ్ అయ్యారు. స్థానిక ఆంజనేయస్వామి, శివాలయంలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీ చంద్‌రెడ్డితో కలిసి పూజలు చేశారు. అనంతరం సంగంబండ రిజర్వాయర్ పరిధిలో మిగిలిపోయిన 400 మీటర్ల కెనాల్ తవ్వకానికి భూమిపూజ చేశారు. అక్కడి నుంచి ప్రజా దీవెన సభకు బయలుదేరారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. సీఎం రేవంత్ సొంత జిల్లా అయిన ఉమ్మడి పాలమూరు జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు శాయశక్తులా కృషి చేస్తామని, వెనుకబడిన మక్తల్ ప్రాంతాన్ని స్థానిక ఎమ్మెల్యే శ్రీహరి నేతృత్వంలో అభివృద్ధికి తోడ్పాటునందిస్తామని చెప్పారు. రాజీవ్ భీమా ఎత్తిపోతల పథకంలో అంతర్భాగమైన సంగంబండ, భూత్పూర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల కింద, అలాగే జూరాల బ్యాక్ వాటర్ కింద ముంపునకు గురై భూములు కోల్పోయిన నిర్వాసితులను అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. త్వరలోనే అర్హులందరికీ తెల్లరేషన్ కార్డులను పంపిణీ చేస్తామని వెల్లడించారు. పేట–కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని మక్తల్–కొడంగల్ పథకంగా మార్చామని, నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.3 వేల కోట్లు కేటాయించిందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ వనజాగౌడ్, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి, సంగంబండ ముంపు బాధితుల సంఘం అధ్యక్షుడు బాల్‌రెడ్డి, బీకేర్ ఫౌండేషన్ అధినేత బాలకృష్ణారెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రేపు సీఎం ఇఫ్తార్ విందు

- ఎల్బీ స్టేడియంలో ఏర్పాట్లు
- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ

హైదరాబాద్, మార్చ్13 (నమస్తే తెలంగాణ) : రంజాన్ మాసం తొలి శుక్రవారం ఈ నెల 15న ఎల్బీ స్టేడియంలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేసినట్టు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమశాఖల రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ వెల్లడించారు. ఇఫ్తార్ ఏర్పాట్లను బుధవారం అధికారులతో కలిసి షబ్బీర్ అలీ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇఫ్తార్ విందుకు సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్యఅతిథిగా, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారని తెలిపారు. ఇఫ్తార్‌లో నమాజ్‌కు, భోజనాలకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. షబ్బీర్‌అలీ వెంట రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, సీఎం కార్యదర్శి షానవాజ్ ఖాసీం, ముఖ్యకార్యదర్శి అహ్మద్ నదీమ్, జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్, సమాచార పౌర సంబంధాలశాఖ ప్రత్యేక కమిషనర్ హనుమంతరావు, తదితర ఉన్నతాధికారులు ఉన్నారు.

మంత్రి శ్రీధర్‌బాబుకూ కరెంటు కష్టాలు

- అధికారిక కార్యక్రమంలో విద్యుత్తు కోత
- సెల్‌ఫోన్ లైట్ల వెలుతురులోనే ముగిసిన ప్రోగ్రాం

సెల్‌ఫోన్ లైట్ల వెలుతురులో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థులు

మల్హార్, మార్చి 13: కాంగ్రెస్ పాలనలో సాక్షాత్తూ రాష్ట్ర మంత్రికే కరెంటు కష్టాలు తప్పలేదు. ఓ అధికారిక కార్యక్రమంలో కరెంటు పోవడంతో సెల్‌ఫోన్ లైట్ల వెలుతురులోనే నడిపించారు. ఈ ఘటన బుధవారం రాత్రి జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హార్ మండలం మల్లారంలో చోటుచేసుకుంది. మల్హార్ మండలంలో పలు అభివృద్ధి పనులకు బుధవారం రాత్రి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు హాజరయ్యారు. షెడ్యూల్ ప్రకారం మధ్యాహ్నం 2 గంటలకు మల్లారం కస్తూర్బా ఆశ్రమ పాఠశాలలో అదనపు తరగతి గదుల ప్రారంభోత్సవానికి హాజరుకావాల్సి ఉంది. కానీ.. రాత్రి 8.30 గంటలకు కార్యక్రమం నిర్వహించారు. అప్పటిదాకా విద్యార్థులు, అధికారులు పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఇంతవరకు బాగానే ఉన్నా.. మంత్రి సభా వేదిక దిగుతుండగానే కరెంటు పోయింది. కరెంటు వస్తుందేమోనని మంత్రి దాదాపు పావుగంట ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. మంత్రిని కలిసి తమ సమస్యలు చెప్పుకుందామని విద్యార్థులు ప్రయత్నించగా.. మొత్తం చీకటిగా ఉండటంతో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తమ సెల్‌ఫోన్ లైట్లను వెలిగించారు. సెల్‌ఫోన్ల లైట్ల వెలుతురులోనే విద్యార్థులు మంత్రికి వినతిపత్రం ఇచ్చి.. ఆయనతో ఫొటో దిగారు.

గత ప్రభుత్వ పథకాలను కొనసాగిస్తాం

ఫర్టిలైజర్‌సిటీ : ప్రజాహితమైన కార్యక్రమాల దృష్ట్యా గత ప్రభుత్వాలు చేపట్టిన పథకాలను, నిర్మాణాలను తాము కొనసాగించి వాటిని మరింత నిర్మాణాత్మకంగా ప్రజలకు అందేలా చర్యలు తీసుకుంటామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని ప్రభుత్వ దవాఖాన ఆవరణలో ఏర్పాటు చేయనున్న 355 ఆదనపు పడకల దవాఖాన భవన నిర్మాణానికి బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. నిరుడు బీఆర్ఎస్ హయాంలో ఏర్పాటు చేసిన దవాఖానలో మౌలిక వసతుల కల్పనతోపాటు వైద్య కళాశాలలో టీచింగ్ సిబ్బందికి ఎలాంటి లోటూ రాని వ్వబోమని చెప్పారు. ప